# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 344 శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# నెల రోజుల్లో హెల్త్ కార్డులు



- కాళేశ్వరం ప్రాజెక్ట్ ఆధారంగా చర్యలు తీసుకుంటే మొత్తం సాగునీటి పారుదల శాఖే ఉండదు
- సాగునీటి పారుదల శాఖలో పని అంటే ఉద్యోగం కాదు.. ఓ భావోద్వేగం
- ఇంజినీర్లు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లాలి. ప్రజల సమస్యలు తెలుసుకోవాలి
- 4 కోట్ల మంది ప్రజల హెల్త్ ప్రొఫైల్స్ డిజిటలైజ్ చేయాల్సి ఉంది: రేవంత్ రెడ్డి
- తక్కువ వైద్యంతో అందరికీ వైద్యం అందించాల్సిన బాధ్యత ఉందన్న రేవంత్
- 30 రోజుల్లో హెల్త్ కార్డులు తెచ్చేందుకు కృషి చేస్తున్నామని వెల్లడి
- గత చికిత్సల వివరాలను హెల్త్ కార్డుల్లో పొందుపరుస్తామన్న సీఎం

హైదరాబాద్:

బీఆర్ఎస్ హయాంలో రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినా.. అది కళ్ల ముందే కూలిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జలసౌధలో ఏఈఈలకు ఉద్యోగ నియామక పత్రాల అందజేత కార్యక్రమం, దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్‌ను ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి గురువారం పాల్గొన్నారు. అనంతరం రేవంత్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఆధారంగా చర్యలు తీసుకుంటే మొత్తం సాగునీటి పారుదల శాఖే ఉండదని పేర్కొన్నారు. "తెలంగాణ ప్రజల భావోద్వేగం వ్యవసాయం, నీరు. సాగునీటి పారుదల శాఖలో పని అంటే ఉద్యోగం కాదు.. ఓ భావోద్వేగం. ఇంజినీర్లు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లాలి. ప్రజల సమస్యలు తెలుసుకోవాలి" అని రేవంత్ సూచించారు. ప్రజలందరికీ నెల రోజుల్లోనే హెల్త్ కార్డులు అందజేస్తామని రేవంత్ వెల్లడించారు. "ప్రతి ఒక్కరి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ తయారు చేయబోతున్నాం. ప్రజల మెడికల్ హిస్టరీ వైద్యులకు అందుబాటులో ఉండేలా చూస్తాం. క్యాన్సర్‌తో - మిగతా3లో



## హైడ్రాకు భారీ డిమాండ్

- హైడ్రా వంటి వ్యవస్థ కావాలని ఆ ప్రాంతాల నుంచి డిమాండ్ వస్తోంది: మంత్రి సీతక్క
- మహబూబ్ నగర్, వరంగల్, ఖమ్మం నుంచి డిమాండ్ వస్తున్నట్లు వెల్లడి
- పేదలను ముందు పెట్టి ఆక్రమణలను కాపాడుకోవాలని కబ్జాదారుల ప్రయత్నమని విమర్శ
- అటవీ చట్టాలతో మౌలిక సౌకర్యాల నిర్మాణాలకు ఆటంకం ఏర్పడుతోందన్న మంత్రి





## కర్ణాటకలో సీబీఐకి నో ఎంట్రీ

- సీఎం సిద్ధ రామయ్య ప్రభుత్వం కీలక నిర్ణయం
- రాష్ట్రంలో సీబీఐకి బహిరంగ సమ్మతిని రద్దు చేసిన ప్రభుత్వం
- ముడా కుంభకోణం కేసు నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనూహ్య నిర్ణయం
- పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల సరసన చేరిన కర్ణాటక
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి లిఖితపూర్వక అనుమతి తీసుకుంటేనే సీబీఐ దర్యాప్తునకు అవకాశం
- సీబీఐ పక్షపాతంతో వ్యవహరిస్తున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నామన్న కాంగ్రెస్

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు!

- ఇక ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎంపిక చేసే అవకాశం
- దసరా పండుగ నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు
- ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు అనుసంధానం చేయనున్న సర్కార్
- రాజీవ్ స్వగృహలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లు, ఇళ్లు వేలం
- పీఎంఏవై కింద రాష్ట్రానికి రావల్సిన బకాయిలు రాబట్టాలని సీఎం సూచన



హైదరాబాద్

దసరా పండుగ నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. గ్రామ/ వార్డు, మండల/ పట్టణ, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుకు విధివిధినాలు ఒకట్రెండు రోజుల్లో రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు దక్కాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన నుంచి ఇతర రాష్ట్రాలు లక్షల సంఖ్యలో గృహాలు మంజూరు చేయించుకుంటే ఈ విషయంలో తెలంగాణ వెనుకబడి ఉందని, ఈ దఫా కేంద్రం మంజూరు చేసే గృహాల్లో గరిష్ట సంఖ్యలో రాష్ట్రానికి ఇళ్లు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పీఎంఏవై కింద రాష్ట్రానికి రావల్సిన బకాయిలు రాబట్టాలని సీఎం - మిగతా3లో



## అనుమతులు ఉన్న భవనాలను కూల్చడం ఏంటీ?

- సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఘాటు లేఖ
- ప్రజలకు ఉపయోగపడే కట్టడాలు నిర్మించాల్సిందీపోయి..
- ప్రభుత్వమే ఇప్పుడు కూల్చివేతలు చేస్తోంది
- కేబినెట్ సమావేశంలో హైడ్రాకు మరిన్ని అధికారాలు కట్టబెట్టడం అన్యాయం
- ప్రభుత్వాలేవైనా నిర్మాణాలు చేసి మంచి పేరు తెచ్చుకోవాలనుకుంటాయి





## పట్టాలపైకి కొత్త డబుల్ డెక్కర్ రైళ్లు!

- భారతీయ రైల్వే కీలక నిర్ణయం..
- తాజాగా డబుల్ డెక్కర్ రైళ్లలోనే భారీగా మార్పులు
- త్వరలోనే ఈ రైళ్లను ప్రారంభించేందుకు సన్నాహాలు
- ప్రస్తుతం డబుల్ డెక్కర్ రైళ్లలో కేవలం ప్రయాణికులు మాత్రమే వెళ్లేందుకు అవకాశం



## ఘోర విషాదం

- పుణ్యస్నానాలు ఆచరిస్తూ.. పుణ్యలోకాలకు
- 37 మంది పిల్లలు, ఏడుగురు మహిళలతో సహా..
- నీట మునిగి 46 మంది మృతి
- నదులు, చెరువుల్లో పుణ్యస్నానాలు ఆచరిస్తూ పిల్లలు, మహిళలు గల్లంతు
- ఇప్పటి వరకు 43 మంది మృతదేహాలను వెలికితీత


# ఫార్మా సిటీ రద్దు వెనుక వేల కోట్ల కుంభకోణం



- ఫార్మా సిటీని రద్దు చేసి ఆ భూములను తిరిగి రెతులకు ఇచ్చేస్తాం
- బీఆర్ఎస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంది ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు
- చివరకు న్యాయమూర్తులను కూడా తప్పుదోవ పట్టిస్తున్నావు
- వేల కోట్లు నొక్కేయాలనే ఆలోచనలో ప్రభుత్వం..
- ఇది పక్కా రియల్ ఎస్టేట్ స్కాం..
- దీన్ని న్యాయమూర్తులు గమనించాలని కోరుతున్నాను
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్

రాజన్న సిరిసిల్ల

హైదరాబాద్ ఫార్మా సిటీ రద్దు వెనుక వేల కోట్ల కుంభకోణం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది పక్కా రియల్ ఎస్టేట్ దందా అని కేటీఆర్ ఆరోపించారు. రాజన్న సిరిసిల్లలోని బీఆర్ ఎస్ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఫార్మా సిటీని రద్దు చేస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ చాలా స్పష్టంగా ఎన్నికలకు ముందు చెప్పింది. ఇబ్రహీంపట్నం, మహేశ్వరంతో పాటు ఇతర వేదికల ద్వారా రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. చాలా మంది నాయకులు స్పష్టంగా చెప్పారు. ఫార్మా సిటీని రద్దు చేసి ఆ భూములను తిరిగి రెతులకు ఇచ్చేస్తాం. బీఆర్ఎస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందని ఇష్టమొచ్చినట్లు మాట్లాడారని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. ఫార్మా సిటీ రద్దు అని సీఎం - మిగతా3లో



## ఆగని బుల్డోజర్ సెగలు

- డిప్యుటేషన్‌పై వివిధ విభాగాల్లోని సిబ్బందిని హైడ్రాకు అటాక్ చేస్తూ ఉత్తర్వులు
- తిరుగులేని బాణంలా దూసుకెళ్తోన్న హైడ్రా..
- చెరువులు, నాలాలపై కబ్జాల కబ్జాల తొలగింపుకు సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాకు ఫుల్ పవర్స్

హైదరాబాద్

అక్రమార్కులను హడలెత్తిస్తోన్న హైడ్రా, ఇప్పుడు సూపర్ పవర్. ఇప్పటికే తెలంగాణ కేబినెట్ హైడ్రాకు చట్టబద్దత కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది.. మిషన్ మూసీ ప్రక్షాళనలో హైడ్రాకు ఫుల్ పవర్స్ ఇచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. తాజాగా హైడ్రాలో కొత్తగా 169 సిబ్బందిని కేటాయించారు. డిప్యుటేషన్‌పై వివిధ విభాగాల్లోని సిబ్బందిని హైడ్రాకు అటాక్ చేస్తూ ఉత్తర్వులు జారీ - మిగతా3లో

# కర్ణాటకలో సీబీఐకినో ఎంట్రీ

మైసూర్ నగరాభివృద్ధి సంస్థ (ముడా) కుంభకోణంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య చుట్టూ ఉచ్చుబిగుస్తోంది. ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధించిన ఈ కేసులో సీబీఐతో దర్యాప్తు చేయించాలంటూ విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కర్ణాటక భూభాగంలో సీబీఐ దర్యాప్తునకు సాధారణ సమ్మతిని సీఎం సిద్ధ రామయ్య ప్రభుత్వం ఉపసంహరించుకుంది. పక్షపాతంగా వ్యవహరిస్తున్న సీబీఐకి అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు ఆ రాష్ట్ర న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ తెలిపారు. రాష్ట్రంలో సీబీఐ విచారణకు బహిరంగ సమ్మతిని ఉపసంహరించుకుంటున్నామని, ఈ దర్యాప్తు సంస్థను దుర్వినియోగం చేస్తుండడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్టు హెచ్‌కే పాటిల్ పేర్కొన్నారు. వారు (కేంద్ర ప్రభుత్వ పెద్ద) పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. 'ముడా' కారణంగా ఈ నిర్ణయం తీసుకోలేదని పాటిల్ చెప్పారు.

" మేము సీబీఐకి సూచించిన కేసుల్లో ఛార్జిషీట్లు దాఖలు చేయలేదు. చాలా కేసులను పెండింగ్‌లో ఉంచారు. మేము పంపిన కేసులను దర్యాప్తు చేసేందుకు నిరాకరించారు. అలాంటి సందర్భాలు చాలా ఉన్నాయి. తప్పుడు మార్గంలో వెళ్లకుండా సీబీఐ నియంత్రించే చర్య ఇది" అని పాటిల్ పేర్కొన్నారు. కాగా సీబీఐకి బహిరంగ సమ్మతిని రద్దు చేసిన రాష్ట్రాల జాబితాలో తాజాగా కర్ణాటక చేరింది. అంతకంటే ముందు పశ్చిమ బెంగాల్, డీఎంకే అధికారంలో ఉన్న తమిళనాడు, వామపక్షాల పార్టీల పాలనలో ఉన్న కేరళ కూడా తమ రాష్ట్రాల్లో సీబీఐ దర్యాప్తునకు బహిరంగ అనుమతిని రద్దు చేశాయి. దీంతో రాష్ట్ర పరిధిలో సీబీఐ ఏదైనా కేసుపై దర్యాప్తు జరపాలంటే రాష్ట్ర ప్రభుత్వాల లిఖితపూర్వక అనుమతిని పొందాల్సి ఉంటుంది.




**ముడా కేసుకు సంబంధం లేదన్న కాంగ్రెస్**

ముడా (మైసూరు నగరాభివృద్ధి సంస్థ) స్కాం నేపథ్యంలో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కర్ణాటకలో కేసులు విచారించేందుకు సీబీఐకి సిద్ధరామయ్య ప్రభుత్వం అనుమతిని నిరాకరించింది. ముడా కుంభకోణం కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో సీబీఐకి కాంగ్రెస్ సర్కారు డోర్లు మూసేయడం చర్చనీయాంశంగా మారింది. తమ పార్టీ నాయకులను బీజేపీ లక్ష్యంగా చేసుకుందని న్యాయ శాఖ మంత్రి హెచ్‌కె పాటిల్ అన్నారు. సీఎం సిద్ధరామయ్య ఎదుర్కొంటున్న ముడా కుంభకోణం ఆరోపణలకు, సీబీఐని రాష్ట్రంలోకి రాకుండా నిర్ణయం తీసుకోవడానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కేంద్ర విచారణ సంస్థలను దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. పక్షపాతంతో వ్యవహరిస్తున్నందు వల్లే తాము ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. తాము సీబీఐకి సూచించిన పలు కేసులలో ఛార్జిషీట్ దాఖలు చేయలేదని, చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

## పార్క్ చేసిన కారులో.. శవమై కనిపించిన ఐదుగురు కుటుంబ సభ్యులు



**చెన్నై:** ఒక కుటుంబానికి చెందిన ఐదుగురు పార్క్ చేసిన కారులో శవమై కనిపించారు. రెండు రోజులుగా రోడ్డు పక్కగా కారు నిలిచి ఉండటాన్ని స్థానికులు గమనించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇది వెలుగులోకి వచ్చింది. ఐదుగురు కుటుంబ సభ్యులు ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. తమిళనాడులోని పుదుక్కొట్టై జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పుదుక్కొట్టై-మధురై హైవేలోని నామనసముద్రంలో సెప్టెంబర్ 24 నుంచి ఒక కారు నిలిచి ఉంది. బుధవారం ఉదయం గమనించిన స్థానికులు ఆ కారు పట్ల అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడకు చేరుకున్నారు. కారును పరిశీలించగా ఒక కుటుంబానికి చెందిన ఐదుగురు సీట్లలో మరణించి ఉన్నారు. కాగా, సేలంలో నివసించే 50 వేళ్ల వ్యాపారవేత్త మణికందన్, భార్య నిత్య, తల్లి సరోజ, పిల్లలైన 17 ఏళ్ల కుమారుడు, 15 ఏళ్ల కుమార్తెగా మృతులను గుర్తించారు. వారు విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఒక సూసైడ్ నోట్‌ను కూడా ఆ కారులో గుర్తించారు. మరోవైపు మెటల్ వ్యాపారం చేసే మణికందన్ అప్పుల్లో కూరుకుపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిడి నేపథ్యంలో ఆ కుటుంబం కారులో ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని అనుమానిస్తున్నారు. పోస్ట్‌మార్టం కోసం మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మొహాలీ ఆస్పత్రిలో చేరిన పంజాబ్ సీఎం భగవంత్ మాన్



**చండీఘడ్:** పంజాబ్ సీఎం భగవంత్ మాన్ అస్వస్థతకు గురయ్యారు. ఆయన్ను మొహాలీలోని ఫోర్టిస్ ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం అర్థరాత్రి ఆయన్ను ఆస్పత్రిలో చేర్పించినట్లు సమాచారం. మూడు సార్లు ఆయన స్పృహ కోల్పోయిన నీరసించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయనకు మెడికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంతకీ ఆయన ఎటువంటి అనారోగ్యంతో బాధపడుతున్నారో ఇంకా స్పష్టంగా తెలియదు. ప్రస్తుతం సీఎం ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపారు. ఫోర్టస్ ఆస్పత్రి మాత్రం సీఎం ఆరోగ్య పరిస్థితిపై ఇంకా ప్రకటన చేయలేదు. కొన్ని రోజుల క్రితం లో బీపీ ఉన్నట్లు సీఎం మాన్ ఫిర్యాదు చేశారు. ఆయన హుటాహుటిన ఢిల్లీ నుంచి మొహాలీకి చేరుకున్నారు.

# అన్నా సెబాస్టియన్ తల్లిదండ్రులను పరామర్శించిన ఎంపీ శశిథరూర్



**న్యూఢిల్లీ :** తీవ్ర పని ఒత్తిడితో పుణేలోని యర్నెస్ట్ అండ్ యంగ్‌లో చార్టెడ్ అకౌటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న 26 ఏళ్ల అన్నా సెబాస్టియన్ మృతి చెందిన నేపథ్యంలో ఆమె కుటుం బాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంపీ శశిథరూర్ పరామర్శించారు. పని ప్రాంతంలో జవాబుదారీతనం, కొత్త చట్టాలు, నిబంధనల గురించి వారితో చర్చించినట్లు తెలిపారు. అలాగే తక్కువ సిబ్బంది ఉన్న సంస్థలు, మధ్య స్థాయి నిర్వాహకులకు మెరుగైన శిక్షణ ఇవ్వాలని ఆయన అభిప్రాయపడ్డారు. వారిని కలిసిన ఫొటోలను ఈ సందర్భంగా ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా పోస్ట్ చేశారు. పుణేలోని యర్నెస్ట్ అండ్ యంగ్ సంస్థలో కేరళకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ సెబాస్టియన్ విధులు నిర్వహిస్తుంది. ఆమె సంస్థలో చేరిన నాలుగు నేలల కాలంలో ఒక్క రోజు కూడా ఆమెకు సెలవు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో అధిక పని ఒత్తిడి కారణంగా హార్ట్ అటాక్‌తో అన్నా సెబాస్టియన్ మరణించింది. ఇదే విషయాన్ని యర్నెస్ట్ అండ్ యంగ్ సంస్థ ఇండియా చైర్మన్ రాజీవ్ మిమాణికి మృతురాలు తల్లి అన్నా అగస్టిన్ లేఖ ద్వారా తెలియజేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో ఎంపీ శశిథరూర్ స్పందించారు. అనంతరం అన్నా సెబాస్టియన్ తండ్రి సెబీ జోసెఫ్‌తో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా అన్నా సెబాస్టియన్ మృతిపై ఎంపీ శశిథరూర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీ శశిథరూర్‌కు సెబీ జోసఫ్ పలు కీలక సూచనలు చేశారు. ఆ సూచనలు ఏమంటే.. అన్ని పని ప్రదేశాల్లో పని గంటలకు ఓ నిర్ణీత క్యాలెండర్ విధానం ఉండాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో అన్ని పని ప్రదేశాల్లో రోజుకు 8 గంటలు పని చేసేలా ఓ నియమం తప్పకుండా ఉండాలని చెప్పారు. అలా వారానికి ఐదు రోజులు మాత్రమే పని దినాలు ఉండాలన్నారని పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో మానవ హక్కుల సంస్థల జోక్యం తప్పని సరిగా ఉండాలని స్పష్టం చేశారు. అయితే అంశాలన్నీ పార్లమెంట్ సమావేశాల ఆరంభంలోనే తాను చర్చిస్తానని ఈ సందర్భంగా సెబీ జోసఫ్‌కు శశిథరూర్ హామీ ఇచ్చిన విషయం విధితమే.

# ఆత్మహత్య చేసుకున్న మహాలక్ష్మి నిందితుడు

**బెంగళూరు :** బెంగళూరు వయాలీ కావల్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో దారుణ హత్యకు గురైన నేపాలీ మహిళ మహాలక్ష్మి కేసులో నిందితుడుగా అనుమానిస్తున్న వ్యక్తి ఆత్మహత్యకి పాల్పడ్డట్లు తెలుస్తోంది. ఈ కేసులో మూడో వ్యక్తి కోసం గాలిస్తున్న పోలీసులకు నిందితుడు ఒడిషాలో చెట్టుకు ఉరేసుకొని చనిపోయినట్లు సమాచారం అందింది. బెంగళూరులోని ఓ అపార్ట్‌మెంట్‌లో దారుణ హత్యకు గురైన మహాలక్ష్మి కేసులో ప్రధాన నిందితుడుగా పోలీసులు అనుమానిస్తున్న వ్యక్తి పేరు ముక్తి రంజన్ రాయ్. ఇతడి కోసం వెస్ట్ బెంగాల్, ఒడిశా సహా ఈశాన్య రాష్ట్రాల్లో గత కొద్ది రోజులుగా పోలీసులు గాలిస్తున్నారు. ఈ క్రమంలో అతడు ఒడిశాలోని భద్రక్ జిల్లాలో ఓ చెట్టుకు ఉరేసుకొని చనిపోయినట్లు పోలీసులకు సమాచారం అందింది. నేపాలీ వివాహిత మహాలక్ష్మితో సన్నిహితంగా ఉన్న వారిలో ఇతడ్నే మొదటి నుంచి పోలీసులు నిందితుడిగా అనుమానిస్తున్నారు. ముక్తి రంజన్ సడోమా సూకిస్టిక్ అనే వ్యాధితో రగిలి పోయేవాడని పోలీసుల విచారణలో తేలింది. 2019లో మహాలక్ష్మి భర్త హేమంత్ దాస్‌తో కలిసి బతుకుదెరువు కోసం బెంగళూరు వచ్చింది. హేమంత్‌దాస్ ఓ సెల్‌ఫోన్ షాప్‌లో పనికి కుదరగా, మహాలక్ష్మి ఓ మాల్‌లో పనిచేస్తూ ఉండేది. వీరికి ఒక బిడ్డ కూడా పుట్టింది. 2023 వరకు కలిసి ఉన్న వీళ్లు, మహాలక్ష్మి ఉత్తరాఖండ్‌కు చెందిన హెయిర్ డ్రస్సర్ అష్రాఫ్‌తో సన్నిహితంగా మెలగడంతో హేమంత్ దూరం అయ్యాడు. బిడ్డను ఆర్నెళ్ల క్రితం భర్త దగ్గరే వదిలి మహాలక్ష్మి ఒంటరిగా ఉంటోంది. కొద్ది రోజుల క్రితం మహాలక్ష్మి నివసించే నేలమంగల్ ఫ్లాట్ గదిలో నుంచి దుర్వాసన వస్తుండడంతో పోలీసులు వచ్చి గది తలుపులు తెరవగా హత్యోదంతం వెలుగు చూసింది. ప్రధాన నిందితుడు ముక్తిరంజన్ రాయ్ మహాలక్ష్మిని చంపిన తర్వాత ఆమెను 40 భాగాలుగా నరికి ఫ్రిడ్జ్‌లో ఉంచి పారిపోయాడు. మహాలక్ష్మిని హత్యచేసింది తానేనని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. పోలీసులు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతని డైరీలో డెత్ నోట్ రాసి ఉన్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ 3న మహాలక్ష్మి ఇంటికి వెళ్లి, ఆమెను హత్య చేసినట్లు నిందితుడు తన డైరీలో రాశాడు. అందులో ఏముందంటే..'ఆమె ప్రవర్తనతో నేను చాలా విసిగిపోయాను. ఇదే విషయమై ఆమెతో గొడవపడగా, మహాలక్ష్మి నాపై దాడి చేసింది. దీంతో కోపోద్రిక్తుడైన నేను క్షణికావేశంలో ఆమెను హత్య చేశాను. ఆమెను చంపిన తర్వాత, నేను ఆమె శరీరాన్ని 59 ముక్కలుగా చేసి ఫ్రిజ్‌లో ఉంచాను. ఆమె ప్రవర్తనతో విసిగిపోయే ఈ పని చేశాను' అని డైరీలో పేర్కొన్నాడు. హంతకుడు ముక్తిరంజన్ రాయ్ నివాసంలో సూసైడ్ నోటు దొరికినట్లు పోలీసులు తెలిపారు. ఒడిశాలోని భద్రక్ జిల్లాలోని ఓ గ్రామంలో చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. ముక్తిరంజన్ బుధవారం పాండి గ్రామానికి వచ్చి తన ఇంట్లో కొంత సమయం ఉండి, ఆ తర్వాత ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరిన అతడు గ్రామంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి సంచలనం సృష్టించిన ఈ హత్య ఘటన తర్వాత ముక్తిరంజన్ అదృశ్యమయ్యాడు. అతడి కోసం కర్ణాటక పోలీసులు నాలుగు బృందాలను ఒడిశాకు పంపారు. అయితే అతడు సెప్టెంబర్ 1 నుంచే మాల్‌కు రావడం మానేశాడు. మహాలక్ష్మి కూడా సెప్టెంబర్ 1 తర్వాత అదృశ్యమైంది. దీంతో ఆమెను సెప్టెంబర్ 2 లేదా సెప్టెంబర్ 3న మహాలక్ష్మిని హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. రెండు రోజులుగా మహాలక్ష్మి ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో ఇరుగుపొరుగు గమనించి బంధువులకు సమాచారం ఇవ్వడంతో గత శనివారం ఈ హాతోదంతం వెలుగులోకి వచ్చింది. మహాలక్ష్మి తల్లి, సోదరి శనివారం ఆమె ఇంటికి వచ్చి చూడగా భయానక దృశ్యం వారికి కనిపించింది. మహాలక్ష్మిని హత్య చేసి, ఆమె మృతదేహాన్ని ముక్కలుగా చేసి ఫ్రిజ్‌లో ఉంచినట్లు పోలీసులు తెలిపారు.

## ఘోర విషాదం



**పాట్నా:** పండుగ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో విషాదం నెలకొన్నది. నదులు, చెరువుల్లో పుణ్యస్నానాలు ఆచరిస్తూ పిల్లలు, మహిళలు గల్లంతయ్యారు. 37 మంది పిల్లలు, ఏడుగురు మహిళలతో సహా 46 మంది నీటిలో మునిగి మరణించారు. బీహార్‌లో ఈ సంఘటన జరిగింది. 'జీవితపుత్రిక' పండుగ సందర్భంగా తమ పిల్లల క్షేమం కోసం తల్లులు ఉపవాసం ఉంటారు. పిల్లలతో కలిసి పవిత్ర స్నానాలు చేస్తారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని 15 జిల్లాల పరిధిలోని నదులు, చెరువుల్లో పుణ్యస్నానాలు ఆచరిస్తూ సుమారు 46 మంది గల్లంతయ్యారు. ఇప్పటి వరకు 43 మంది మృతదేహాలను వెలికితీశారు. కాగా, బీహార్‌లోని తూర్పు, పశ్చిమ చంపారన్, నలంద, ఔరంగాబాద్, కైమూర్, బక్సర్, సివాన్, రోహ్తాస్, సరన్, పాట్నా, వైశాలి, ముజఫర్‌పూర్, సమస్తిపూర్, గోపాల్‌గంజ్, అర్వాల్ జిల్లాల్లో మహిళలు, పిల్లలు మునిగిపోయిన సంఘటనలు నమోదైనట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం గురువారం వెల్లడించింది. 37 మంది పిల్లలు, ఏడుగురు మహిళలతో సహా 46 మంది నీటిలో మునిగి మరణించినట్లు తెలిపింది.

మరోవైపు సీఎం నితీశ్ కుమార్ తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. చనిపోయిన వారిలో ఎనిమిది మంది కుటుంబ సభ్యులకు ఇప్పటికే పరిహారం అందజేసినట్లు పేర్కొన్నారు.

## ఆన్ లైన్ గేమ్ యాప్స్ ద్వారా భారీగా నగదు మళ్లింపు



ఆన్ లైన్ లోన్ యాప్సే కాదు.. గేమింగ్ యాప్స్ ద్వారా డ్రాగన్ చైనా పెద్ద కుట్ర పన్నింది. భారత దేశం నుంచి రూ.400 కోట్ల నగదును గేమింగ్ యాప్‌తో స్వాధీనం చేసుకుంది. చైనా బండారాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బయటపెట్టింది. రూ.400 కోట్లలో రూ.25 కోట్లను రికవరీ చేసింది.

**నలుగురి అరెస్ట్**

గేమింగ్ యాప్‌కు సంబంధించి నలుగురు భారతీయులను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. చైనా మూలాలు ఉన్న పౌరులు భారతదేశం నుంచి పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించారని అధికారులు గుర్తించారు. ముగ్గురు చైనా పౌరులకు చెందిన క్రిప్టో ఖాతాలను స్వాధీనం చేసుకుంది. గేమింగ్ యాప్ ద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థను బలహీనం చేసేందుకు కుట్ర పన్నిందని అధికారులు వివరించారు.

**దాడులతో వెలుగులోకి..**

గేమింగ్ యాప్‌నకు వ్యతిరేకంగా దేశంలో పలు ప్రాంతాల్లో ఈడీ దాడులు చేసింది. ఆ సమయంలో కొందరు భారతీయులను అదుపులోకి తీస్నీకుంది. ఫీవిన్ యాప్ ఆధారిత ఆన్ లైన్ బెట్టింగ్, గేమర్ల నుంచి సేకరించిన డబ్బును కొందరి బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. అందుకు ప్రతీగా యాప్ యజమానులు రీఛార్జ్ చేయడానికి కమీషన్ ఇచ్చేవారు. ఒడిశా రూర్కెలాకు చెందిన అరుణ్ సాహు, అలోక్ సాహు రీఛార్జ్ చేసే వ్యక్తులుగా పనిచేశారని ఈడీ అధికారులు వెల్లడించారు.

**క్రిప్టో కరెన్సీగా మార్పు..**

ఫీవిన్ యాప్ ద్వారా బ్యాంక్ ఖాతాల్లో వచ్చిన డబ్బు క్రిప్టో కరెన్సీగా మార్చారు. ఫీవిన్ యాప్ నుంచి సంపాదించిన క్రిప్టో కరెన్సీని చైనీస్ వ్యక్తుల వాలెట్లలో విదేశీ క్రిప్టో ఎక్స్ఛేంజ్‌లో జమ చేశారని ఈడీ అధికారులు వివరించారు.

## పట్టాలపైకి కొత్త డబుల్ డెక్కర్ రైళ్లు!




భారతీయ రైల్వే ఎప్పటికప్పుడు ప్రయాణికులకు సౌర్యవంతమైన, సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందుకు ప్రయత్నిస్తున్నది. ఇందులో భాగంగా ఇప్పటికే పలు కొత్త రైళ్లను ప్రవేశపెట్టింది. తాజాగా డబుల్ డెక్కర్ రైళ్లలోనే భారీగా మార్పులు తీసుకురాబోతున్నది. త్వరలోనే ఈ రైళ్లను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నది. ప్రస్తుతం డబుల్ డెక్కర్ రైళ్లలో కేవలం ప్రయాణికులు మాత్రమే వెళ్లేందుకు అవకాశం ఉన్నది. ఇకపై ప్రయాణికులు వస్తువులతో సహా ప్రయాణించేందుకు వీలు కల్పిస్తున్నది. ఈ రైళ్లను టూ ఇన్ వన్ రైళ్లుగా పిలుస్తుంటారు. వాస్తవానికి, భారత్‌లో డబుల్ డెక్కర్ రైళ్లు నడుస్తున్నా.. వీటి సంఖ్య చాలా తక్కువగా ఉన్నది. వీటిలో ప్రస్తుతం ప్రయాణికులు మాత్రమే ప్రయాణిస్తున్నారు. సరుకు రవాణాకు అవకాశం లేదు. అయితే, వీటిని రైల్వే అప్‌డేట్ చేస్తున్నది. ప్రస్తుతం రెండు రైళ్లను తయారు చేయిస్తున్నది. ఈ రైళ్లలో 20 కోచ్‌లు ఉంటాయి. ఈ కొత్త డబుల్ డెక్కర్ రైల్‌ని కపుర్తలాలోని కోచ్ ఫ్యాక్టరీలో తయారు చేస్తున్నారు. బెల్లీ ఫ్రైట్ కాన్సెప్ట్‌తో నడిచే ఈ రైళ్ల కోచ్‌ల ట్రయల్‌ని త్వరలో పూర్తి చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రైలు ఎగువ కోచ్‌లో 46 ప్రయాణికులు కూర్చునేలా సీటింగ్ ఏర్పాటు చేస్తారు. దిగువ కోచ్ భాగంలో ఆరు టన్నుల వరకు వస్తువులను రవాణా చేసేలా ఏర్పాట్లు చేస్తారు. అయితే, మూడు రైళ్ల డిజైన్లను రైల్వేబోర్డుకి దృష్టికి తీసుకెళ్లగా.. ఇందులో ఓ డిజైన్ ఆమోదం పొందింది. ఒక్కో కోచ్ తయారీకి రూ.2.70కోట్ల నుంచి రూ.3కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. రైల్ కోచ్ ఫ్యాక్టరీలో మొదటి కార్గో లైనర్ రైలుని నిర్మిస్తున్నారు. ఈ డిజైన్ చాలా ప్రత్యేకంగా ఉంటుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ రైలు పూర్తిగా ఎయిర్ కండిషన్ ఉంటుందని.. అన్ని రకాల వస్తువులను రవాణా చేసేలా రూపొందించినట్లు పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రయాణికులతో పాటు సరుకు రవాణా చేసేలా రైళ్లు ఉండాలని రైల్వే భావించింది. ప్రస్తుతం కాన్సెప్ట్ రైళ్లు అందుబాటులో లేవు. త్వరలోనే ఈ తరహా రైళ్లను భారతీయ రైల్వేశాఖ ప్రవేశపెట్టబోతున్నది.

# ఫార్మా సిటీ రద్దు వెనుక వేల కోట్ల కుంభకోణం

-మొదటిపేజీ తరువాయి

రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటనలు చేశారు. అయితే ఫార్మా సిటీ ఉన్నదా..? పోయిందా..? అని కొందరు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మా సిటీ రద్దు కాలేదు.. అట్లనే ఉందని నిన్న హైకోర్టులో పిటిషన్ వేసింది. నేను ఈ ప్రభుత్వాన్ని ఒక్కటే సూటిగా అడుగుతున్నా.. సీఎం ఎక్కడ మాట్లాడినా ఉన్న సిటీ గురించి మాట్లాడడం లేదు. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఫోర్త్ సిటీ అని మాట్లాడుతున్నాడు. సీఎం రేవంత్ రెడ్డి చెప్పు చేతనైతే.. నీ భాషలో చెప్పాలంటే మొగోడివి అయితే చెప్పు.. నీవు చెప్పే ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ కోసం ఒక్క ఎకరమైనా భూసేకరణ చట్టం కింద సేకరించావా..? మీరు ఒక్క ఎకరం భూమి సేకరించకపోతే, మేం గతంలో ప్రతిపాదించిన ఫార్మా సిటీ భూమే అయితే దాన్ని ఇతర అవసరాలకు ఎలా మళ్లిస్తావు..? చివరకు న్యాయమూర్తులను కూడా తప్పుదోవ పట్టిస్తున్నావు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారు అని కేటీఆర్ తెలిపారు.

**ఫోర్ బ్రదర్స్‌కు రియల్ ఎస్టేట్ దందాకు వాడుతా అంటే రైతులు ఊరుకోరు..**

నువ్వు గతంలో చెప్పిన మాట ప్రకారం.. ఫార్మా సిటీని రద్దు చేసిన మాట నిజమే అయితే.. ఆ భూములను రైతులకు తిరిగిచ్చే పని చేయ్. అలా కాకుండా ఫోర్త్ సిటీ కడుతా.. ఫిఫ్త్ సిటీ కడుతా.. మా ఫోర్ బ్రదర్స్‌కు రియల్ ఎస్టేట్ దందాకు వాడుతా అంటే రైతులు ఊరుకోరు. ఏ రైతులైతే నీకు ఓటేశారు.. వారే నీ పార్టీ అంతు చూస్తారు. రేపు ప్రభుత్వం కోర్టులో స్పష్టంగా చెప్పాలి. లక్షలాది మందికి ఉపాధి కల్పించే ఫార్మా సిటీ కడుతున్నారా..? లేదా..? అదే విధంగా కోర్టు కూడా నోటీసు చేయాలని న్యాయమూర్తులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఫార్మా సిటీ కోసం ఏడేండ్లు కష్టపడి రైతులను ఒప్పించి, మెప్పించి.. నానా తంటాలు పడి సేకరించిన 14 వేల ఎకరాల్లో 64 వేల కోట్ల పెట్టుబడులు రావాలని లక్షలాది మంది ఉద్యోగ ఉపాధి అకాశాలు రావాలని ఫార్మాసిటీని ప్రతిపాదించామని కేటీఆర్ తెలిపారు.



**వేల కోట్లు నొక్కేయాలనే ఆలోచనలో ప్రభుత్వం..**

ఫార్మా సిటీ కోసం ఆనాడు సేకరించిన 14 వేల ఎకరాలు కండిషనల్ ల్యాండ్ అక్విజిషన్ కింద తీసుకున్నాము. అంటే ఫార్మా సిటీ కోసమే మేము తీసుకుంటున్నాము అని స్పష్టంగా జీవోలో పేర్కొంటూ ఫార్మా సిటీ కోసం భూములను తీసుకున్నాం. ఇవాళ ఆ భూములను రియల్ ఎస్టేట్ దందా కోసం, ఫ్యూచర్ సిటీ అనే డ్రామాల కోసం, ఫోర్త్ సిటీ అనే హంగామా కోసం, ఏఐ సిటీ అనే హడావుడి కోసం మళ్లించి దాంట్లో నుండి వేల కోట్లు నొక్కేయాలనే ఆలోచన ప్రభుత్వం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది పక్కా రియల్ ఎస్టేట్ స్కాం.. దీన్ని న్యాయమూర్తులు గమనించాలని కోరుతున్నాను. భూ దందాలను తప్పకుండా బయటపెడుతాం. ఫార్మా సిటీ విషయంలో ప్రభుత్వాన్ని అడుగుతున్నా.. ఫార్మా సిటీని కొనసాగిస్తే 14 వేల ఎకరాల్లో ఉండాలి లేదా రద్దు చేస్తే ఆ భూమి రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు.

**నా మీద కోపంతో.. నేతన్నల మీద కక్ష తీర్చుకుంటున్నాడు.. రేవంత్‌పై కేటీఆర్ ఫైర్**

రాజకీయంగా నా మీద కోపంతో.. రాజన్న సిరిసిల్ల ప్రజలు, నేతన్నల మీద పగబట్టినట్టు కక్ష తీర్చుకుంటున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను బంద్ చేయడంతో నేతన్నలకు సంబంధించిన వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయని కేటీఆర్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. బతుకమ్మ పండుగ అతి త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ రోజు చాలా బాధాతప్త హృదయంతో మాట్లాడుతున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం దివాళకోరు నిర్ణయం వల్ల రాష్ట్రంలోని కోటి మందికి పైగా ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు బంద్ అయ్యాయి. బతుకమ్మ చీరల పంపిణీ పథకం వెనుక ఉన్న ఉద్దేశం, ఆలోచనపై ఈ సీఎంకు, ప్రభుత్వానికి కనీస అవగాహన లేదు. నేతన్నల సమస్యలపై శాసనసభలో చెప్పే ప్రయత్నం చేశాను. నా మీద రాజకీక్ష కక్ష ఉంటే నా మీద తీసుకోండి. కానీ నేతన్నలను ఇబ్బంది పెట్టొద్దని విజ్ఞప్తి చేశాను. మూర?పు ప్రభుత్వం ఇది. సిరిసిల్ల స్థితిగతులు తెలియని ప్రభుత్వం ఇది. దివాళాకోరు, పనికిమాలిన ప్రభుత్వం ఇది అని కేటీఆర్ మండిపడ్డారు.

2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో సిరిసిల్లలో ఆత్మహత్యలు జరిగాయి. ఒకటే వారంలో ఆనాడు 9 మంది నేతన్నలు బలవన్మరణానికి పాల్పడ్డారు. వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. పార్లమెంట్ ఎంపీగా కేసీఆర్ చలించిపోయి.. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకపోతే మా పార్టీ తరపున రూ. 50 లక్షలు పద్మశాలీ ట్రస్ట్‌కు ఇచ్చి సిరిసిల్లను ఆదుకుంటామని కేసీఆర్ స్పష్టంగా చెప్పారు. ఆ ట్రస్టుకు ఇచ్చిన 50 లక్షల ద్వారా 2 వేల కుటుంబాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి ఆదుకునే ప్రయత్నం చేశామని కేటీఆర్ గుర్తు చేశారు.రాష్ట్రం ఏర్పడ్డాక సిరిసిల్ల వ్యాపరవేత్తలతో నాటి సీఎం కేసీఆర్ సమావేశం ఏర్పాటు చేసి.. నేతన్నలను ఏ విధంగా ఆర్థికంగా బలోపేతం చేయాలని అడిగారు. మీరు మాకు పని కల్పించాలని వారు కోరారు. పని కల్పించడం కాదు.. గొప్పగా సంపాదించాలంటే ఏం చేయాలో అడిగారు. కోటి మంది ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయాలని కేసీఆర్ నిర్ణయించారు. దానికి అనుగుణంగా.. సిరిసిల్లలో బతుకమ్మ చీరలు తయారు చేయాలని చెప్పారు. ఏడాదికి 8 నెలలు ఏ ఢోకా లేకుండా ఉపాధి కల్పించాలని కడుపు నింపిన మహానుభావుడు కేసీఆర్. స్కూల్ యూనిఫామ్స్, కేసీఆర్ కిట్‌లో ఇచ్చే చీరలు రంజాన్ తోఫా, క్రిస్మస్‌కు కానుక ఇచ్చే చీరలను సిరిసిల్లలో తయారు చేయించారు కేసీఆర్ అని కేటీఆర్ తెలిపారు.

# ఆగని బుల్డోజర్ సెగలు

-మొదటిపేజీ తరువాయి

చేసింది తెలంగాణ ప్రభుత్వం. నలుగురు అదనపు కమిషనర్లు, ఐదుగురు డీసీపీలు, 16 మంది ఇన్‌స్పెక్టర్లు, 16 మంది ఎస్సైలు, 60 మంది కానిస్టేబుళ్లు, 12 మంది స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు, 10 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు సహా సైంటిస్ట్, తహసీల్దార్లు, సర్వేయర్ ,ఫారెస్ట్ ఆఫీసర్‌తో హైడ్రా మరింత బలోపేతమైంది. తిరుగులేని బాణంలా దూసుకెళ్తోన్న హైడ్రా.. ఇప్పుడు మరింత బలోపేతం అవుతుంది. చెరువులు, నాలాలపై కబ్జాల కబ్జాల తొలగింపుకు సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాకు ఫుల్ పవర్స్ ఇచ్చారు. అయితే, ఆక్రమణలను తొలగించడం మంచిదే.. కానీ సంపన్నుల విషయంలో ఒకలా.. నిరుపేదల విషయంలా మరోలా వ్యవహరిస్తున్నారని కన్నెర్ర చేస్తున్నాయి విపక్షాలు.హైడ్రా పేరుతో హైడ్రామాలు చేస్తున్నారన్నారని ఆరోపించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. బాధితులకు బీఆర్ఎస్ అండగా వుంటుందన్నారు. అవసరమైతే బుల్డోజర్‌కు అడ్డుగా తాము నిలబడుతామన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా లీగల్ ఎయిడ్ అందిస్తామన్నారు.హైడ్రా ముసుగులో పేదలపై దుర్మార్గపు చర్యలను ఆపాలన్నారు బీజేపీ నేత, ఎంపీ ఈటల రాజేందర్. లేదంటే ఉద్యమం తరహాలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ సర్కారు తప్పుల చిట్టాను ప్రజల్లోకి తీసుకెళ్తామని ఈటల చెప్పారు. హైడ్రా యాక్టివిటీ హద్దుల్లో ఉండాలంటున్నాయి విపక్షాలు .పర్యావరణ పరిరక్షణే లక్ష్యం.. చెరువులు, నాలాలపై కబ్జాలను తొలగించడమే మార్గం అంటూ హైడ్రాను మరింత స్ట్రెంథెన్ చేస్తోంది సర్కార్. సవాళ్లు –ప్రతిసవాళ్లతో బుల్డోజర్ పాలిటిక్స్ మరింతగా హీటెక్కుతున్నాయి.

**మూసి ప్రాంతాల్లో సర్వే**

మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మూసీ



పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన ప్రాంతాలను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో 16 బృందాలు సర్వే చేస్తున్నాయి. రంగారెడ్డి జిల్లాలో నాలుగు బృందాలు .. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 5 బృందాలు పర్యటిస్తున్నాయి.మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న బఫర్ జోన్‌లో సర్వే కొనసాగుతుంది. గోల్కొండ మండల పరిధిలోని ఇబ్రహీంబాగ్, ఆశ్రమ్‌నగర్‌లో కొలతలు తీసుకున్నారు. అక్రమ నిర్మాణాలను గుర్తించిన అధికారులు వాటికి మార్క్ చేస్తున్నారు. మార్క్ చేసిన నిర్మాణాలను త్వరలో కూల్చివేస్తామంటున్నారు అధికారులు.పాతబస్తీ పరిధిలోని చాదర్‌ఘాట్, మూసానగర్, శంకర్‌నగర్‌లోని మూసీ పరివాహక ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. ఆక్రమణలను గుర్తించి కూల్చివేసే నిర్మాణాలకు మార్క్ చేస్తోన్నారు. సాయంత్రం వరకు సర్వే కొనసాగనుంది.సర్వే కోసం వచ్చిన అధికారులను స్థానికులు అడ్డుకుంటున్నారు. అధికారులతో స్థానికులు వాగ్వాదానికి దిగుతున్నారు. తామంతా పేదవాళ్లమని.. ఇప్పటికిప్పుడు నివాసాలు కూల్చేస్తే ఎక్కడికి వెళ్లి బతకాలని ప్రశ్నిస్తున్నారు. తమకు ప్రత్యామ్నాయం చూపేవరకు ఇళ్లను కూల్చొద్దని వేడుకుంటున్నారు.

# అనుమతులు ఉన్న భవనాలను కూల్చడం ఏంటీ?

తెలంగాణ రాష్ట్రంలో హైడ్రా పేరుతో హైడ్రామా నడుస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ప్రజలకు ఉపయోగపడే కట్టడాలు నిర్మించాల్సిందిపోయి.. ప్రభుత్వమే ఇప్పుడు కూల్చివేతలు చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న నిర్మాణాలను తొలగించేందుకు.. సరైన ప్రణాళిక లేకుండా ఏకపక్షంగా ముందుకెళ్తున్నారు. దీనిపై పేద ప్రజలు చేస్తున్న ఆందోళనలను, వారి మనోవేధనను పరిగణనలోకి తీసుకోకుండా.. కేబినెట్ సమావేశంలో హైడ్రాకు మరిన్ని అధికారాలు కట్టబెట్టడం అన్యాయమన్నారు. హైదరాబాద్ పరిసరాల్లో హైడ్రా ఆధ్వర్యంలో జరుపుతున్న కూల్చివేతలపై పునరాలోచన చేయాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పేరుతో ఓ విభాగాన్ని ఏర్పాటుచేసి, పేదలను రోడ్డుపాలు చేస్తున్నారన్నారు. సాధారణంగా.. ప్రభుత్వాలేవైనా నిర్మాణాలు చేసి మంచి పేరు తెచ్చుకోవాలనుకుంటాయి. చరిత్రలో నిలిచిపోయేలా పేదలకు నిలువ నీడ నిచ్చే ఇండ్లు, రోడ్లు, భవనాలు, బ్యారేజీలు, బ్రిడ్జిలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు కట్టడం, ప్రజలకు ఉపయోగపడే ఇతర నిర్మాణాలపై దృష్టి సారించి ప్రజలకు మేలుచేసేందుకు ప్రయత్నిస్తాయి. కానీ, రేవంత్ ప్రభుత్వం ఇందుకు భిన్నంగా.. కూల్చివేతల ద్వారా పేరు తెచ్చుకోవాలని భావిస్తున్నట్లు అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. కనీస ప్లానింగ్ లేకుండా విచ్చలవిడిగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. దీన్ని సాకుగా తీసుకుని కాంగ్రెస్ సర్కార్.. నిర్మాణాత్మక ఆలోచనలకు, ప్రజోపయోగ మౌలికవసతుల నిర్మాణానికి డబ్బుల్లేవన్న కారణాలు చూపుతోందన్నారు. ఎలాంటి ప్రణాళిక లేకుండానే, హడావుడి చేసి నిత్యం వార్తల్లో ఉండే లక్ష్యంతో.. అక్రమ కట్టడాల పేరిట ఇండ్లను కూల్చివేసే మార్గాన్ని ఎంచుకుందని దుయ్యబట్టారు. ఈ ప్రక్రియను.. న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా చేపట్టి ఉంటే బాగుండేదని తెలంగాణ ప్రజల అభిప్రాయపడుతున్నారని గుర్తు చేశారు.


బాధితుల ఆందోళనలు, మేధావుల ఆలోచనలను పరిగణన లోనికి తీసుకోవాలని కిషన్ రెడ్డి సూచించారు. దీనికి ఓ స్పష్టమైన విధానం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఆక్రమణలను, అక్రమ నిర్మాణాలను మేం సమర్థించం కాకపోతే.. వీటిపై చర్యలు తీసుకునే సమయంలో చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా, సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా ఉండాలన్నారు. ముఖ్యంగా.. పేద, మధ్యతరగతి విషయంలో వీటి ఆధారంగానే పనిచేయాలన్నారు. ప్రస్తుతం అక్రమ కట్టడాలు అంటున్న ప్రాంతాల్లో వెలసిన ఇండ్లకు ప్రభుత్వం తరపున కోట్ల రూపాయలు ఖర్చుచేసి వేసిన రోడ్లు, వెలిగించిన వీధి లైట్లు, కల్పించిన తాగునీటి వసతులు, డ్రైనేజీ సౌకర్యం, కరెంటు కనెక్షన్లు, కమ్యూనిటీ హాళ్లు, చివరకు %+ఎవీజ% తరపున ఇంటి నెంబరును కేటాయించిన విషయం వాస్తవం కాదా? అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. దశాబ్దాలుగా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏల ద్వారా సేవలు అందిస్తూ పన్నులు తీసుకుంటున్నప్పుడు అక్రమం అనిపించిందని నిలదీశారు. హఠాత్తుగా అక్రమం అంటే వాళ్లు ఎక్కడకు వెళ్లాలి? పేద, మధ్యతరగతి ప్రజలు ఏమైపోవాలి? పేద, మధ్యతరగతి ప్రజలు అప్పులు చేసి, బ్యాంకు రుణాలు తీసుకుని.. ప్లాట్లు, అపార్టుమెంట్లు కొనుక్కున్నారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. అధికారిక అనుమతులు ఉన్న భవనాల్ని కూడా నేలమట్టం చేయటం బాధాకరమన్నారు. ప్రభుత్వానికి సమగ్ర ప్రణాళిక ఉండాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిజాయితీ, పారదర్శకత, మానవత్వం, సామాజిక బాధ్యత, నిర్మాణాత్మక నియమ నిబంధనలు ఉండాలి. మూసీ పరివాహక ప్రాంతం లో 15 వేలకు పైగా పేద, మధ్య తరగతి కుటుంబాలున్నాయి. వారి నివాసాలను హైడ్రా ద్వారా కూల్చేముందు.. వారితో చర్చించాలని కేంద్ర మంత్రి సూచించారు. పాలకులు, అధికారుల అవినీతి, ఓటుబ్యాంకు రాజకీయాల కారణంగా ప్లాట్లుగా చేసి మధ్య దళారీల ద్వారా అమ్మారన్నారు. పేదలు జీవితమంతా సంపాదించిన సొమ్ముతో నిర్మించుకున్న ఇండ్లను కూల్చే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. ముఖ్యమంత్రిగా తీసుకునే నిర్ణయం.. అందరికీ న్యాయం జరిగేలా ఉండాలని కేంద్ర కిషన్ రెడ్డి ఆకాంక్షించారు..

## ఆ విషయమై ప్రశ్నించినందుకే రెండోసారి మంత్రి పదవి ఇవ్వలేదు: కేసీఆర్‌పై కడియం శ్రీహరి

**స్టేషన్ ఘనపూర్‌కు ఉపఎన్నిక రాదు... వచ్చినా సిద్ధమేనన్న కడియం**

**ఫిరాయింపులను తొలుత ప్రోత్సహించిందే బీఆర్ఎస్ అని విమర్శ**

**ఉపఎన్నిక వస్తే బీఆర్ఎస్‌కు డిపాజిట్ కూడా రాదని వ్యాఖ్య**



వరంగల్ చరిత్రను కనుమరుగు చేయడానికే ఉమ్మడి జిల్లాను కేసీఆర్ ముక్కలు చేశారని, దీనిపై తాను ప్రశ్నించినందుకు తనకు రెండోసారి మంత్రి పదవి ఇవ్వలేదని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. స్టేషన్ ఘనపూర్‌కు ఉప ఎన్నికలు రావని... ఒకవేళ వచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధమన్నారు. జనగామలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... స్టేషన్ ఘనపూర్‌కు ఉపఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ సిద్ధంగా ఉందన్నారు. ఫిరాయింపులను తొలుత ప్రోత్సహించిందే బీఆర్ఎస్ అని ఆరోపించారు. ఏకంగా శాసనసభ పక్షాలను కలుపుకున్న చరిత్ర బీఆర్ఎస్‌ది విమర్శించారు. ఉపఎన్నిక వస్తే బీఆర్ఎస్‌కు స్టేషన్ ఘనపూర్‌లో డిపాజిట్ కూడా రాదని జోస్యం చెప్పారు. కోర్టులపై, ప్రజాస్వామ్యంపై తమకు గౌరవం ఉందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ కుటుంబం చేతిలో తెలంగాణ బందీ అయిందని విమర్శించారు. స్టేషన్ ఘనపూర్‌కు త్వరలో ఉపఎన్నిక వస్తుందని, పార్టీ నుంచి తాటికొండ రాజయ్య విజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై కడియం శ్రీహరి పైవిధంగా స్పందించారు.

## బీజేపీ, కాంగ్రెస్ ఒక నాణేనికి రెండు ముఖల్లాంటివి.. కపిల్ సిబల్‌కు కేటీఆర్ కౌంటర్

**హైదరాబాద్ :** కాంగ్రెస్ నేత కపిల్ సిబల్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. కపిల్ సిబల్ వైఖరి చూస్తుంటే గురివింద గింజ మాదిరిగా ఉందని కేటీఆర్ ధ్వజమెత్తారు. కర్ణాటకలో ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి, పడగొట్టేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తుందని, అందుకు ఎమ్మెల్యేల కొనుగోలు, పదో షెడ్యూల్‌ను దుర్వినియోగం చేయడం, సీబీఐ, ఈడీలను ఉపయోగించుకుంటుందని కపిల్ సిబల్ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌కు కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ధర్మానికి ఆదర్శం కాదని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక నాణేనికి రెండు ముఖాలు అని పేర్కొన్నారు. కర్ణాటకలో బీజేపీ అవలంభిస్తున్న పద్ధతులను తెలంగాణలో కాంగ్రెస్ ఫాలో అవుతుందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రలోభపెడుతున్నారు. టెన్త్ షెడ్యూల్‌ను దుర్వినియోగం చేస్తున్నారు. పోలీసు, విజిలెన్స్ దాడులతో భయాన్ని కలిగిస్తున్నారు. సీఎం భారీ అవినీతికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి నేతలు రాజ్యాంగాన్ని నిర్దాక్షిణ్యంగా తుంగలో తొక్కుతుంటే.. రాహుల్ గాంధీ మాత్రం రాజ్యాంగం పట్టుకుని ఫోజులిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

## నెల రోజుల్లో హెల్త్ కార్డులు

-మొదటిపేజీ తరువాయి

ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. అందరికీ వైద్యం అందేలా చూడటం మనందరి బాధ్యత. వైద్య ఖర్చుల్లో ఎక్కువగా టెస్టులే ఉంటున్నాయి. క్యాన్సర్ మహమ్మారితో చాలా మంది అనేక ఇబ్బందులు పడుతున్నారు. మహమ్మారి చికిత్స పేదలకు భారమవుతోంది. విద్య, వైద్యానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ విడివిడిగా హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలని అన్నారు. మరో 30 రోజుల్లో ప్రజలకు హెల్త్ కార్డులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. 4 కోట్ల ప్రజల హెల్త్ ప్రొఫైల్స్ అన్నింటినీ డిజిటలైజ్ చేయాల్సి ఉందని చెప్పారు. ఈ హెల్త్ కార్డ్స్ లో గత చికిత్స వివరాలన్నింటినీ పొందుపరుస్తామని తెలిపారు. ఈరోజు హైదరాబాద్ లో దుర్గాబాయి దేశ్ ముఖ్ రెనోవా క్యాన్సర్ ఆసుపత్రిని రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పైవ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో క్యాన్సర్ వైద్య సేవలు అందరికీ అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఎవరైనా ఆసుపత్రికి వెళ్తే తరచూ ప్రాథమిక పరీక్షలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆరోగ్య గుర్తింపు కార్డులు లేకపోవడం వల్లే తరచూ ప్రాథమిక పరీక్షలు చేయాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. అందుకే రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి హెల్త్ ప్రొఫైల్‌ను డిజిటలైజ్ చేసేందుకు చర్యలు తీసుకున్నాం" అని రేవంత్ తెలిపారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు!

-మొదటిపేజీ తరువాయి



సూచించారు. కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సమాచారం వెంటనే ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో డేటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సీఎం అన్నారు. పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తే ఇంజినీరింగ్ సిబ్బంది సమస్య ఎదురయ్యే పరిస్థితి ఉంటుందని అధికారులు తెలపగా? అవసరమైతే ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియామకాలు చేపట్టాలని ముఖ్యమంత్రి అన్నారు. రాజీవ్ స్వగృహలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లు, ఇళ్లు వేలం వేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఏళ్ల తరబడి వృథాగా ఉంచడం సరికాదని, వెంటనే వేలానికి రంగం సిద్ధం చేయాలన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా వాటిని ఎందుకు అప్పగించలేదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అర్హులకు ఆ ఇళ్లను అప్పగించాలన్నారు. హైదరాబాద్ నగరంలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లకు మౌలిక వసతులు కల్పించి, వాటికి అర్హులైన లబ్ధిదారులకు అప్పగించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్, తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఎండీ వి.పి.గౌతమ్, ఇతర అధికారులు పాల్గొన్నారు

## హైడ్రాకు భారీ డిమాండ్

హైడ్రా వంటి వ్యవస్థ కావాలని మహబూబ్ నగర్, వరంగల్, ఖమ్మం సహా పలు ప్రాంతాల నుంచి డిమాండ్ వస్తోందని మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలకు సంబంధించి హైడ్రాకు స్వయంప్రతిపత్తి ఇచ్చినట్లు చెప్పారు. ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇలాంటి వ్యవస్థ కావాలని అడుగుతు న్నారని తెలిపారు. కబ్జాదారులు పేదలను ముందు పెట్టి ఆక్రమణలను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. నిజంగానే పేదలు ఉంటే వారికి అనుకూలంగా నిర్ణయం తీసుకునే దిశగా ప్రయత్నం చేస్తామన్నారు. సీతక్క ఢిల్లీలో పెసా యాక్ట్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణలోని సమస్యలను ఈ సమావేశం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. గ్రామ సభల తీర్మానమే ఉన్నతమైనదని పెసా యాక్ట్ చెబుతోందన్నారు. పెసా యాక్ట్ ఉన్న గ్రామాల్లో అక్కడి పెద్దల తీర్మానాలతో వివిధ అనుమతులు తీసుకోవచ్చునని చెప్పారు. మౌలిక సౌకర్యాల నిర్మాణాలకు అటవీ చట్టాలతో ఆటంకం ఏర్పడుతోందన్నారు. కేంద్రం మంజూరు చేసిన అటవీ ప్రాంతానికి సంబంధించి నిధులు ఏళ్లుగా మురిగిపోతున్నాయని సీతక్క అన్నారు. అటవీ చట్టాలతో మౌలిక సౌకర్యాల నిర్మాణాలకు ఆటంకం కలుగుతోందన్నారు. దీంతో నిధులు ఖర్చు చేయని పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. కేంద్రం నిధుల వినియోగానికి అటవీ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. అనుమతులు లభించేలా అటవీ అధికారులకు సూచనలు చేయాలని ఈ సమావేశంలో కోరినట్లు తెలిపారు. గ్రామాల అవసరాలకు అవసరమైన అనుమతులు వచ్చేలా చూడాలని కోరామన్నారు. అటవీ గ్రామాల అభివృద్ధికి గ్రామ సభలకు అధికారం ఇవ్వాలన్నారు.

# వరుస ఆఫర్లు... డైలామాలో కృష్ణయ్య



**హైదరాబాద్ :** బీసీ పోరాటల నుంచి రాజకీయాల్లోకి వచ్చిన కృష్ణయ్యను తెలంగాణ రాజకీయాల్లో వాడుకోవాలని రెండు ప్రధాన పార్టీలు పోటీ పడుతున్నాయట? కేంద్రంలో పదవి ఇస్తామని ఓ పార్టీ.. రాష్ట్రంలో చూసుకుంటామని మరో పార్టీ ఆయన వెంట పడుతున్నాయని చెబుతున్నారు..బీసీ ఉద్యమనేత ఆర్.కృష్ణయ్య పొలిటికల్ ఫ్యూచర్‌పై తెలంగాణలో విస్తృత చర్చ జరుగుతోంది. బీసీ ఉద్యమం అంటేనే గుర్తుకొచ్చే ఆర్.కృష్ణయ్య గత పదేళ్లుగా రాజకీయాల్లో చక్రం తిప్పుతున్నారు. తెలంగాణల్లో ప్రభావవంతమైన బీసీ నేతగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉండటంతో ప్రధాన రాజకీయ పార్టీలు ఆర్.కృష్ణయ్య కోసం ఎప్పుడూ డోర్స్ ఓపెన్ చేసి ఉంచుతున్నాయి.ఇప్పుడు కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్ర ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్.. ఆర్.కృష్ణయ్యను తమ పార్టీలో చేరమంటే తమ పార్టీలో చేరమని ఆహ్వానిస్తున్నట్లు చెబుతున్నారు. నిన్నటివరకు వైసీపీ రాజ్యసభ సభ్యుడిగా ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆర్.కృష్ణయ్య అకస్మాత్తుగా తన ఎంపీ పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు. బీసీ ఉద్యమ నేతగా తెలంగాణలో ఆయనకు గణనీయమైన అనుచరగణం ఉండటంతో ప్రధాన పార్టీలు రెండూ కృష్ణయ్య కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు చెబుతున్నారు.90వ దశకం నుంచి బీసీ ఉద్యమ నేతగా తెలంగాణలో తన ముద్ర వేసిన కృష్ణయ్య? 2014లో తొలిసారిగా ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యేగా గెలిచారు. రాష్ట్ర విభజన సమయంలో బీజేపీ–టీడీపీ పొత్తుతో టీడీపీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా పోటీ చేసిన ఆర్.కృష్ణయ్య ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత టీడీపీ శాసనసభ్యుల్లో ఎక్కువ మంది అప్పటి టీఆర్ఎస్‌లో చేరినా, కృష్ణయ్య మాత్రం సింగిల్‌గానే ఉండిపోయారు. ఇక 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మిర్యాలగూడ నుంచి పోటీ చేసి ఓడిన కృష్ణయ్య, రెండేళ్ల క్రితం ఏపీ నుంచి వైసీపీ తరఫున రాజ్యసభలో అడుగు పెట్టారు.ఐతే తెలంగాణలో బలపడాలని భావిస్తున్న బీజేపీ.. ఎప్పటి నుంచో ఆర్.కృష్ణయ్యపై గురిపెట్టినట్లు చెబుతున్నారు. వైసీపీకి చెందిన రాజ్యసభ సభ్యులు వరుసగా రాజీనామాలు చేస్తుండటంతో కృష్ణయ్యతోనూ రాజీనామా చేయించి పార్టీలోకి తీసుకోవాలని కమలనాథులు స్కెచ్ వేసినట్లు చెబుతున్నారు. అంతేకాకుండా తమ పార్టీలోకి వస్తే జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ చేస్తామని హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.ఇక ఉరుము లేని పిడుగులా? అకస్మాత్తుగా రాజ్యసభకు రాజీనామా చేసిన కృష్ణయ్య మళ్లీ బీసీ ఉద్యమంలో పనిచేస్తానని ప్రకటించినా, ఆయనతో కాంగ్రెస్ నేతలు ప్రత్యేకంగా భేటీ కావడం, సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, బీసీ నేత, మాజీ ఎంపీ వీహెచ్ వంటి వారు కృష్ణయ్యను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తూ ప్రకటనలు చేయడం ఆసక్తి పెంచేస్తోంది. తాను బీసీ ఉద్యమానికే పరిమితమవుతానని కృష్ణయ్య చెబుతున్నా? రెండు ప్రధాన పార్టీల నుంచి ఆహ్వానాలు ఉండటంతో ఎటూ తేల్చుకోలేక ఆయన అలాంటి ప్రకటనలు చేస్తున్నారని అంటున్నారు. ఒక వైపు కేంద్రం, రెండో వైపు రాష్ట్రం నుంచి పదవులు ఇస్తామని చెబుతుండటంతో ఏ పదవి అయితే బాగుంటుందని ఆయన సన్నిహితులతో చర్చిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రాజకీయాల్లోకి వచ్చిన పదేళ్లలో మూడు పార్టీలు మారిన ఆర్.కృష్ణయ్య ఈ సారి ఏ పార్టీలోకి వెళతారనే ఆసక్తి అందరిలో కనిపిస్తోంది. ముఖ్యంగా తెలంగాణలో బలపడాలని భావిస్తున్న కమలనాథులు? జాతీయ స్థాయిలో ఎలివేషన్ ఇస్తామని చెబుతుండటంతో ఆయన అడుగులు అటువైపు వేస్తారా? లేక లోకల్ ఫీలింగ్‌తో కాంగ్రెస్‌ను ఎంచుకుంటారా? అనేది ఉత్కంఠ రేపుతోంది. మొత్తానికి పొలిటికల్ చౌరస్తాలో నిలబడిన బీసీ ఉద్యమనేత ఎంపీ పదవిని వదులుకోవడం ఒక ఎత్తైతే? ఇప్పుడు కొత్తగా చేరే పార్టీని ఎంచుకోవడం మరో ఎత్తుగా చెబుతున్నారు. ఏదిఏమైనా కొద్దిరోజుల్లోనే ఈ సస్పెన్స్‌కు తెరపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు.

# హైడ్రా బాధితులకు అండగా గులాబీ దళం



**హైదరాబాద్ :** హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రామాలాడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. బలిసినోడికి ఒక న్యాయం, పేదోళ్లకు మరొక న్యాయం అంటే ఊరుకునేది లేదన్నారు. దమ్ముంటే పర్మిషన్లు ఇచ్చినోళ్లు, బిల్డర్లపై చర్యలు తీసుకోవాలని సవాల్ విసిరారు.ఆక్రమణలు, తప్పుడు పర్మిషన్లు ఇచ్చిందే కాంగ్రెసోళ్లు అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "మీ మంత్రులు, మీ అన్న ఇళ్లు కూల్చేసి సీఎం రేవంత్ రెడ్డి నిజాయితీ నిరూపించుకోవాలి. హైడ్రా బాధితులకు బీఆర్ఎస్ న్యాయ పరంగా అండగా ఉంటుంది. బాధితులు తెలంగాణ భవన్ కు రావొచ్చు. మీ ఇబ్బందులు చెప్పొచ్చు. పార్టీ తరపున ఉన్న లీగల్ టీమ్ మీకోసం పోరాడుతుంది. హైడ్రా బాధితుల విషయంలో ప్రభుత్వానికి మానవీయ కోణం ఉండాలి" అని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణం ప్రారంభించిన ఎస్టీపీలను బుధవారం కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన? హైదరాబాద్ నగరాన్ని విశ్వ నగరంగా తీర్చిదిద్దాలన్న దృఢ సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరాన్ని పూర్తి మురుగునీటి రహిత నగరంగా మార్చే ప్రయత్నం చేశామని చెప్పుకొచ్చారు. ఇవాళ కూకట్‌పల్లి నియోజ కవర్గంలోని ఫతేనగర్ ఎస్టీపీని తమ పార్టీ బృందం సందర్శించిందని తెలిపారు. ఎస్టీపీల సందర్శనల్లో ఇది మొదటి అడుగు మాత్రమే అన్న ఆయన? మిగిలిన ఎస్టీపీలను కూడా సందర్శిస్తామని ప్రకటించారు"వందశాతం మురుగు నీటిని శుద్ధి చేసిన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని మ ప్రభుత్వ లక్ష్యంగా ఉండే. ఈ శుద్ధి చేసిన పూర్తి స్వచ్ఛమైన నీరు మూసీ నదిలోకి పోతుంది. హైదరాబాద్ నగరంలోని 94 శాతం స్వచ్ఛమైన నీరు మూసికి వెళ్తున్నప్పుడు మూసి నీటిని శుద్ధి చేయాల్సిన అవసరం ఏముంది..? వంద శాతం మురుగునీటి శుద్ధి జరిగిన తర్వాత మూసి ప్రాజెక్టు కోసం లక్షన్నర కోట్లు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఏమున్నది.. ? ఈ ప్రాజెక్టుకు సంబంధించి మంత్రులు, ప్రభుత్వం రూ. 50 వేల కోట్లు, రూ. 70,000 కోట్లు, రూ. 1,50,000 కోట్లు అంటూ పూటకు ఒక మాట మాట్లాడుతున్నారు. అందుకే ఈ మూసీ నది ప్రక్షాళనపైన అనేక అవినీతి తాలూకు అనుమానాలు వస్తున్నాయి" అని కేటీఆర్ విమర్శలు చెప్పారు."హైదరాబాద్ నగరంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టలేం అని ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతున్నారు. అదే నిజమైతే మూసీ నది నుంచి తొలగించే పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎట్లా ఇస్తామన్నారు..? మేము హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం భారీగా భూమిని సేకరించి సిద్ధంగా ఉంచితే అది రద్దు అంటూ పూటకో మాట మాట్లాడుతున్నారు. గతంలో మా ప్రభుత్వం చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి" అంటూ ప్రభుత్వానికి హితవు పలికారు.త్వరలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఒక కార్యచరణ ప్రకటిస్తామని కేటీఆర్ చెప్పారు. హైదరాబాద్ నగరంలో ఎక్కడ పేదల ఇల్లు కూలకొట్టినా.. హైదరాబాద్ నగరంలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొన్న హైడ్రా వాళ్ళు ఇల్లు కూలకొట్టినప్పుడు చిన్న పాప వేదశ్రీ మాట్లాడిన మాటలు ప్రతి ఒక్కరిని కదిలించాయని గుర్తు చేశారు.

# నార్సింగి స్టేషన్...కేరాఫ్ వీఐపీ కేసులు



**హైదరాబాద్ :** నార్సింగి ఠాణా లవ్ బ్రేకప్ ఇష్యూలకు స్పాట్‌గా మారింది. లా అండ్ ఆర్డర్, డ్రగ్స్ వంటి కేసులు కన్నా లవ్ షికాయతులే ఎక్కువగా నార్సింగి పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. వాటిల్లో మేజర్ కేసులు సినిమా వాళ్లకు చెందినవే కావడం గమనార్హం.లేటెస్ట్‌గా హర్షసాయిపై రేప్ కేసు ఫైలయింది నార్సింగి పీఎస్‌లోనే. ఇక రీసెంట్‌గా సంచలనం రేపిన జానీ మాస్టర్ కేసును నార్సింగ్ పోలీసులే డీల్ చేస్తున్నారు. ఆ మధ్య లావణ్య–రాజ్ తరుణ్ వివాదం సినిమాను తలపించింది. ఇంకా సీరియల్‌లా కొనసాగుతూనే ఉంది. రాజ్ తరుణ్‌కు తనకు పెళ్లయిందని.. లివ్ ఇన్ రిలేషన్‌లో ఉన్నామని.. మాల్వీ వల్లే తమ మధ్య గొడవలొచ్చాయని.. రాజ్ తరుణ్ తనను మోసం చేశారంటూ నార్సింగి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు లావణ్య. పరిచయం నిజమే కానీ తమకు పెళ్లి కాలేదని..అసలు మ్యారేజ్‌పై తనకు ఇంట్రెస్ట్ లేదన్నారు రాజ్ తరుణ్. అలా వాదోపవాదాలు సంచలనం రేపాయి. రీసెంట్‌గా మరోసారి కంప్లైంట్ ఇచ్చారు లావణ్య. తన బంగారం, పుస్తెల తాడు, తాళి బొట్టు, డాక్యుమెంట్లు చోరీ చేశారని ఆరోపిస్తూ రాజ్ తరుణ్, మాల్వీపై నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది లావణ్యరాజ్‌తరుణ్ ? లావణ్య కేసులో పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. రాజ్‌తరుణ్ తనను ప్రేమించి, మోసం చేశారని లావణ్య చేసిన ఆరోపణల్లో నిజం ఉందని పోలీసులు నిర్ధారించారు. వాళ్లిద్దరూ పదేళ్లుగా ఒకే ఇంట్లో ఉన్నట్లుగా తమ ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. దర్యాప్తులో భాగంగా లావణ్య ఇంటి వద్ద సాక్ష్యాలు, పలు కీలక ఆధారాలు కూడా సేకరించినట్లు చార్జ్‌షీట్‌లో ప్రస్తావించారు. అయితే ఈ కేసులో ముందస్తు బెయిల్ తెచ్చుకున్నాడు రాజ్ తరుణ్.జానీ మాస్టర్ తనను లైంగికంగా వేధించాడని.. తన మాట వినకపోతే ఇండస్ట్రీలో అవకాశాలు లేకుండా చేస్తానని బెదిరించాడంటూ అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ 40 పేజీల్లో తన ఆవేదనను..జానీమాస్టర్‌తో పరిచయం..ఔట్ డోర్ షూటింగ్‌లో లైంగిక దాడి.. వంటి అంశాలు సహా జానీ మాస్టర్ భార్య కూడా తనపై దాడి చేసిందని కంప్లైంట్ ఇచ్చారామె. ముందుగా రాయదుర్గం పీఎస్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదైనప్పటికీ.. బాధితురాలు ఫిర్యాదు ప్రకారం ఆమెపై దాడి జరిగిన ప్రాంతం నార్సింగి పీఎస్ పరిధిలో ఉండడంతో కేసును అక్కడకు ట్రాన్స్‌ఫర్ చేశారు. గోవాలో జానీ మాస్టర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు ఆయన్ని కోర్టులో ప్రవేశపెట్టడం.. 14 రోజుల రిమాండ్ పడడం తెలిసిందే. పోక్సో సహా పలు సెక్షన్ల కింద జానీ మాస్టర్‌పై కేసు ఫైల్ చేశారు నార్సింగిపోలీసులు. మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఆయన్ని కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరారు.ఇక బిగ్‌బాష్ ఫేమ్ షణ్ముఖ్ జస్వంత్ కేసు అప్పట్లో సంచలనం రేపింది. తాజా జానీ మాస్టర్, హర్షసాయి కేసుల తరహాలోనే షణ్ముఖ జస్వంత్ కంటెంట్ కూడా సేమ్ టు షేమే. ఆ కేసును డీల్ చేసింది కూడా నార్సింగి పోలీసులే. షాట్‌ఫిల్మ్‌లో ఛాన్స్ పేరిట షణ్ముక్, అతని సోదరుడు సంపత్ వినయ్ తనను మోసం చేశారని బాధితురాలు నార్సింగి పోలీసులను ఆశ్రయించారు. సంపత్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మరొకర్ని మ్యారేజ్ చేసుకున్నాడని కంప్లైంట్ ఇచ్చారామె. అంతేకాదు పర్సనల్ వీడియోలను సోషల్ మీడియాలో పెడుతామని బ్లాక్ మెయిల్ చేశారన్నారు. కేసును టేకప్ చేసిన పోలీసులు విచారణ బాగంగా నానక్‌రామ్ గూడాలోని షణ్ముఖ్ ఇంటికి వెళ్లి చేస్తే గంజాయి గుట్టు బయటపడింది.ఇక మరో ప్రముఖ యూట్యూబర్ చందు సాయి కేసును కూడా నార్సింగి పోలీసులే డీల్ చేశారు. నార్సింగికి చెందిన యువతిని చందు సాయి ప్రేమ పేరుతో మోసం చేశాడనేది అభియోగం. అతనిపై అత్యాచారం, మోసం కేసు నమోదైంది. ఈ కేసులో జైలుకు వెళ్లిన చందు సాయి బెయిల్‌పై బయటకు వచ్చాడు.ఇక ఇప్పుడు యూట్యూబర్ హర్ష సాయి పై అత్యాచారం కేసు ఫైలయింది కూడా నార్సింగ్ పీఎస్‌లోనే. పాన్ ఇండియా మూవీ సంగతి ఏమో కానీ రేప్, 2 కోట్ల దగా, బ్లాక్ మెయిలింగ్ ఆరోపణలతో హర్షసాయి డర్టీ పిక్చర్ నార్సింగి పీఎస్ రికార్డులకెక్కింది. అదేం చిత్రమోకానీ లా అండ్ ఆర్డర్ కేసులకన్నా ఇట్టాంటి కేసులకు నార్సింగ్ పీఎస్ కేరాఫ్‌గా మారిందనే టాక్ పీక్స్‌కు వెళ్లింది.

## షరతులు లేకుండా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలి

**– ఇల్లు లేని పేదలకు ఇల్లు వెంటనే మంజూరు చేయాలి**



**వాస్తవ నేస్తం,బోనకల్:** మండల కేంద్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇరుగు జానేసు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల మేరకు ఎలాంటి శత్రువు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలని కోరుతున్నారు. ఇల్లు లేని పేదలు ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఇండ్లు ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, గృహ నిర్మాణ శాఖ మంత్రిని కోరారు. పేద ప్రజల అందరికీ న్యాయం చేయాలని ప్రతి పేదవారికి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేయాలని ఆయన కోరారు.

## అత్యవసర సమయంలో రక్తదానం

## – ఆదర్శంగా నిలిచిన యువకులు







**వాస్తవనేస్తం,బజార్హతనూర్:** జర్నలిస్ట్ ముండే ప్రభాకర్ మాతృమూర్తి ముండే శాలబాయి గత కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ నిజామాబాద్ లో గల ఓ ప్రైవట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అత్యవసరంగా శస్త్ర చికిత్స కోసం రక్తం అవసరం అని తెలుసుకున్న జేఎం అదేశ్, తెలంగాణా వంజరి సేవ సంఘం నాయకులు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఆపద సమయంలో ఉన్న వారికి రక్తదాతలు ఓ దేవదూత ల వచ్చి ధాత్రికరాజు వంజరి, మమడిపల్లి కొండెరి శ్రీనివాస్ వంజరి, మమడిపల్లి కపిలు వంజరి, విజ్జు వంజరి, గంగోని సంతోష్ వంజరి, శంభురాజ వంజరి లు రక్తదానం చేసి ఆదుకున్నారు. తమకు ఆపద కాలంలో సహాయం చేసిన ధాత్రిక ధర్మ రవీందర్ వంజరి, అనిల్ వంజరి, రాజు కరిపే కు పలువురు ప్రశంసించారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**– అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగ సభలు నిషేధం**


**– మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు**

**– జిల్లా ఎస్పీ గౌష్ ఆలం**



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉన్నందున అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. నిషేధిత ఆయుధాలు దురుద్దేశంతో నేరాలకు ఉసిగొలిపే ఎటువంటి ఆయుధాలు కలిగి ఉండరాదని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియాలో అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని హెచ్చరించారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధంలో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునే అనుమతులు తీసుకోవాలని సూచించారు.

## ఘనంగా చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలు



**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** భూమికోసం, భుక్తి కోసం, ఆత్మగౌరవం కోసం వీరోచితంగా పోరాడిన వీరనారి చిట్యాల ఐలమ్మ 129వ జయంతి వేడుకలు మండల కేంద్రంలోని రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రజక సంఘం సభ్యులు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరనారి చిట్యాల ఐలమ్మ పాత్ర మరువలేనిదని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన పోరులో ఆమె కీలక పాత్ర పోషించారని చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో, ధైర్య సాహసాలతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు అరుగుల గణేష్, ఉపాధ్యక్షులు నాగరాజ్, దేవురాజు, కోశాధికారి గంగాధర్, దేవన్న, భూమన్న, శేఖర్, అనిల్, సురేష్, రాజు, ప్రవీణ్, విక్కీ, ప్రణయ్, రవి, శివ, తదితరులు పాల్గొన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com